"వెంకటస్వామీ! చెప్పినదంతా అర్థమయింది కదూ?"

భయంగా, బెదురుగా దామోదరం వైపు చూశాడు వెంకటస్వామి. "సార్! ఈ పని... పాపం, సార్! దైవ దర్శనం కోసం వెళ్ళే వారిని దోచుకోవటం..."

"షటప్!" చిన్నగా కసిరాడు దామోదరం. "జాగ్రత్త! నీ భార్యా బిడ్డలు... నా గుప్పిట్లో వున్నారు. వాళ్ళెక్కడున్నారో ఆచూకీ కూడా నీకు తెలియదు. నేను చెప్పినట్లు చేస్తేనే వాళ్ళని తిరిగి చూడగలుగుతావు, లేకపోతే..."

"... వద్దు సార్! మీరు చెప్పినట్లే చేస్తాను" అన్నాడు వెంకటస్వామి మనసులోనే లెంపలు వేసుకుంటూ.

"గుడ్! యిక వెళ్ళి, బస్ స్టార్ట్ చెయ్!" అన్నాడు దామోదరం సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

మాట్లాడకుండా స్టీరింగ్ ముందు కూర్చుని, ఎదురుగావున్న అలమేలు మంగా-వెంకటేశ్వరుల ఫొటోలకు భక్తిగా నమస్కారం చేసి, ఇగ్నిషన్ కీ తిప్పాడు. బర బరమంటూ ఇంజన్ స్టార్ట్ అయింది.

ఎదురుగా ఒక ముత్తయిదువ వచ్చేవరకు ఆగి, బస్‌ని ముందుకు దూకించాడు వెంకటస్వామి. బస్‌లోవున్న వారందరు కబుర్లలో పడ్డారు. కొందరు దిన పత్రికలు, వార పత్రికలు తీశారు. పిల్లలు కిటికీలలో నుంచీ బయటకు చూస్తున్నారు. పెడన దాటగానే స్పీడ్ పెంచాడు వెంకటస్వామి. పెరిగిన గడ్డం తడుముకున్నాడు. వ్యూ మిర్రర్‌లో నుంచీ వళ్ళంతా బంగారపు ముద్దలాగా వున్న భాగ్యలక్ష్మి కనిపిస్తోంది.

ఆవిడ గురించే బస్ ద్వారకా తిరుమలకు టూరిస్ట్‌గా బయల్దేరింది. భాగ్యలక్ష్మి భర్త బసవలింగం బిజినెస్‌లో బాగా సంపాదించాడు. పలుకుబడీ, పరిచయాలు ఎక్కువ.

బసవలింగం ఒకసారి తీవ్రంగా జబ్బుపడ్డాడు. డాక్టర్లు తెల్లవారితేగాని చెప్పలేం అన్నారు. దాంతో కంగారు పడిపోయిన భాగ్యలక్ష్మి వెంటనే తన భర్తకి నయమైతే వెంకటేశ్వరునికి 'నిలువు దోపిడి' యిస్తానని మొక్కుకుంది. బసవలింగం ఆరోగ్యం పుంజుకున్నాడు.

ఆ తరువాత ఒక మందు విందులో తన మిత్రులతో భార్య మొక్కు సంగతి చెప్పాడు.

"అదేమిటోయ్! సాధారణంగా ఎవరైనా తిరుపతి అంటే పెద్ద తిరుపతికి వెడతారు. కాని ఈ ద్వారకా తిరుమల ఏమిటి?" అన్నారు ఒకరిద్దరు.

"ఆవిడగారి పుట్టిల్లు ఏలూరుకు దగ్గర్లోనే వున్న భీమడోలు. అందువల్ల ఆవిడ భక్తి అంతా ద్వారకా తిరుమలవాసుడే! మొక్కుకుంది కనుక వెళ్ళాల్సిందే" అన్నాడు బసవలింగం నవ్వుతూ.

"అయితే మేమూ వస్తాం, ఏకంగా ఒక టూరిస్ట్ వేసేస్తే సరి" అన్నారొకరు.

"ఔను. మేమూ ఆ ద్వారకా తిరుమల చూడలేదు యింతవరకు" అన్నారు మిగిలిన వారందరూ.

అలా ప్రోగ్రాం సెటిలయింది. బసవలింగంతోబాటు అందరూ 'ల' కారులే. దాదాపు పది కుటుంబాలు! మంచి టూరిస్ట్ బస్‌లు సప్లయ్ చేసే స్టార్ కంపెనీకి కబురు వెళ్ళింది. ఆ తరువాత ఏర్పాట్లన్నీ అయిపోయాయి.

దామోదరానికి అప్పుడే దురాలోచన ఏర్పడింది. బస్‌లో వచ్చేవాళ్ళందరూ సంపన్నులు! పైగా యిటువంటప్పుడు ఆడవాళ్ళు ఒకరిపై ఒకరు పోటీకోసం వున్న నగలన్నీ అలంకరించుకుంటారు!

స్టార్ టూరిస్ట్ బస్‌లంటే జాగ్రత్తగా తీసుకువెళతాయని, బస్‌లు కండిషన్‌లో వుంటాయని ఒక నమ్మకం వుంది ప్రజలలో. అదే యిప్పుడు అవకాశంగా ఉపయోగించుకోదలిచాడు దామోదరం. అతను స్టార్ కంపెనీలో మేనేజర్.

బస్‌లో అందరిదగ్గరా వుండే నగలు, వాచీలు, డబ్బు — ఎంతలేదన్నా లక్షపైన వుంటాయి... చాలు!

ద్వారకా తిరుమల రూట్‌లో భీమడోలు దాటాక కొంత దూరం వెళ్ళాక రోడ్డుకి అటూ యిటూ చెట్లతో అరణ్యంలా వుంటుంది. అక్కడకు వచ్చేసరికి తను బస్

నిలువు దోపిడి

స్లో చేయాలి! ఏదో ఒక స్పాట్‌లో ఆరుగురు వాటు పిస్తోళ్ళతో రెడీగా వుంటారు. బస్ ఆపేసి, అందర్నీ నిలువు దోపిడి చేసేస్తారు!

అదీ దామోదరం ప్లాన్!

నిన్న తను ఏదో పెళ్ళికి గుంటూరు వెళ్ళివచ్చాడు. వచ్చీరాగానే దామోదరం తనని యింటికి వెళ్ళకుండా ద్వారకా తిరుమల వెళ్ళమన్నాడు. మామూలుగా యిచ్చే బేటా కాకుండా ఐదు వందలు ఎక్కువ తనే యిస్తానన్నాడు. తను వప్పుకున్నాక అసలు విషయం బయటపెట్టాడు.

నిలువుదోపిడి అని తెలిశాక తను ఆ పని చేయలేనన్నాడు. కాని తన భార్యాబిడ్డలు వాడి ఆధీనంలో వున్నారుట! తప్పదు! ఆ దుర్మార్గుడితో ఈ పాపంలో పాలు పంచుకోవాల్సిందే!

ఎలాగో అలా ఏలూరులో ఒక గంట ఆలస్యం చేయమని దామోదరం చెప్పాడు. ఆ వ్యవధిలో ఒక పాత నల్ల ఫోర్డ్ కారులో ఆరుగురు దామోదరంతోబాటు నిర్ణయించుకున్న స్పాట్‌కి చేరుకుంటారు.

రాత్రి పదకొండు గంటలు కావస్తోండగా ఏలూరు చేరింది బస్. ఒక ఇరానీ హోటల్ ముందు బస్ ఆపాడు వెంకటస్వామి.

"సార్! అందరూ టీ త్రాగండి! ఎవరు నిద్రపోయినా నాకూ నిద్ర వస్తుంది. డ్రైవింగ్‌లో తూలు వచ్చిందంటే..." అని ఆగిపోయాడు.

"సరే! నువ్వే వెళ్ళి, కాస్త ఆలస్యమయినా అందరికీ బస్‌లోకే టీ పంపించమను. నువ్వూ తాగి, రా!" అన్నాడు బసవలింగం.

వెంకటస్వామి బస్ దిగి, ఇరానీ హోటల్లోకి వెళ్ళిపోయాడు. బస్‌లో వారి సంభాషణ అతనికి వినిపిస్తూనేవుంది.

"ఇక్కడినుంచీ గంటలో వెళ్ళగలమా?" అడిగారెవరో.

"ఆహా మంచి స్పీడ్ వెడితే చేరుకోవచ్చు. కాని వెంకటస్వామి ఎక్కువ స్పీడ్ వెళ్ళడు. జాగ్రత్త ఎక్కువ!" అన్నాడు బసవలింగం.

"అదీ నిజమే! ఓవర్ స్పీడ్ వెళ్ళి యాక్సిడెంట్ చేస్తే ఏం చేయగలం?" అన్నారెవరో.

"వెళ్ళిమాత్రం చేసేది ఏముంది? తెల్లవారేవరకు కాటేజ్‌లో నిద్రపోవటమే గదా?" అన్నారు మరొకరు.

ఆ తరువాత సంభాషణ యాక్సిడెంట్లు, డ్రైవర్‌లు — అలా సాగిపోయింది! అందరికీ అంచెలు అంచెలుగా టీ అందజేశాడు వెంకటస్వామి. అరగంట తరువాత బస్ స్టార్ట్ చేసేసరికి ఈదురుగాలి ఆరంభమయింది. క్షణాలమీద ఉధృతమయి, వర్షం ఆరంభమయింది. కిటికీ అద్దాలు ఎత్తి కూర్చున్నారు.

"వర్షం తగ్గాక పోదాం...ఇంత వర్షంలో డ్రైవింగ్ చేయటం మంచిదికాదు. అసలే రూటు బాగుండదు..." అన్నాడు వెంకటస్వామి.

ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. దాదాపు అరగంట తరువాత వర్షం, గాలి తగ్గిపోయాయి. బస్ కదిలి వేగం అందుకుంది.

భీమడోలు దాటగానే వెంకటస్వామి గుండె దడదడలాడటం మొదలయింది.

ఈపాటికి ఆ దుర్మార్గులు అక్కడికి చేరుకునే వుంటారు. మరో పావు గంటలో కిరాతకం జరిగిపోతుంది!

"స్వామీ! ఈ విధంగానైనా నీ దర్శనం చేసుకుంటున్నానని, మొక్కు తీర్చుకుంటున్నానని సంతోషించాను. కాని ఇలాంటి నిలువు దోపిడీ వ్యవహారంలో చిక్కుకు పోతాననుకోలేదు..." అని మనసులోనే బాధపడుతూ, అక్కడక్కడా రోడ్డుకి అడ్డంగా